
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

గురువారం 27 ఫిబ్రవరి 2025





ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు

కోటప్ప కొండ కింద భారీ విద్యుత్ ప్రభలు




కోటప్పకొండపై భక్తులు

శివాయ.. రుద్రాయ

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- త్రికోటేశ్వరస్వామికి నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు
- కోటయ్యస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం
- కొలువుతీరిన 20 భారీ విద్యుత్ ప్రభలు..
- శివనామస్మరణతో మార్మోగిన అమరావతి, క్వారీ, గోవాడ, కాకాని

హరహర శంభో శంకర.. ఓం నమః శివాయ.. శివాయ రుద్రాయ.. చేదుకో కోటయ్య చేదుకో.. నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమ్రోగగా.. శివయ్య దర్శనాలతో భక్తులు తరించారు. బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలు, కోటయ్య తిరునాళ్లు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్త జన సందోహంతో కిటకిట లాడింది. త్రికూటాద్రిపై త్రికో టేశ్వర స్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. లక్షలాది మంది భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలి వస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి త్రికోటేశ్వరస్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పిం చడంతో ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామికి పట్టువస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువున కొలువు దీరాయి. విద్యుత్ కాంతుల్లో ప్రభలు భక్తులకు కనువిందు చేయగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని అమరావతిలోని అమరేశ్వరాలయం, పెదకాకాని లోని మల్లికార్జునస్వామి వారి ఆలయం, క్వారీ, గోవాడ క్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వర స్వామి



కోటప్పకొండలో త్రికోటేశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే అరవిందబాబు



సంగం జాగర్లమూడిలో సంగమేశ్వరుడికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి మనోహర్





అమర్తలూరు : గోవాడలో బాల కోటేశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

7



క్వారీలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో కాకాని మల్లేశ్వరుడు

నేడు పట్టభద్రుల పోలింగ్

- బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి



సత్తెనపల్లి : కేంద్రీయ విద్యాలయం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు



నరసరావుపేట: మున్సిపల్ బాలికల స్కూల్‌లో పోలింగ్ కేంద్రం

7

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ

» ప్రతిపాదనలు పంపాలని డీఎంఈకి మంత్రి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ సిద్ధమైంది. తద్వారా వారు విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు పొందేందుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో విదేశీ భాషలపై శిక్షణకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు పంపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)ను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. తొలుత 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఇలాంటి కోర్సులను ప్రవేశ పెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి నర్సింగ్ విద్యార్థుల భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థతో కలిసి ఈ శిక్షణ ఇవ్వాలని ఆరోగ్యశాఖ ఆలోచిస్తోంది. ఈ విషయంపై మంత్రి సత్యకుమార్ సంబంధిత సీనియర్ అధికారులతో ఇటీవల చర్చించారు. సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని డీఎంఈని ఆదేశించారు. కాగా, దీనిపై డీఎంఈ ఇప్పటికే 7 వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థుల అభిప్రాయాలు, భాషా ప్రాధాన్యతల గురించి అభిప్రాయాలు తీసుకుంది. ఎక్కువ మంది నర్సింగ్ విద్యార్థులు జర్మన్, జపనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్ వంటి భాషలను నేర్చుకునేందుకు ఉత్సాహంగా ఉన్నట్టు తెలిసింది.

పీసీసీఎఫ్ ఎంపికకు కమిటీ నియామకం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ నుంచి రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్) పోస్టుకు తగిన అధికారిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పీసీసీఎఫ్‌గా ఉన్న చిరంజీవ్‌చౌదరి ఈనెల 28న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అపెక్స్ స్కేల్‌తో కూడిన ఐఎఫ్ఎస్ అధికారిని పీసీసీఎఫ్‌గా ఎంపిక చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీని నియమించారు.

శివరాత్రి స్నానాలకు వెళ్లి 9మంది మృతి

» గోదావరిలో మునిగి ఐదుగురు విద్యార్థులు..
» శ్రీశైలంలో కొడుకును రక్షించబోయి తండ్రీ..
» బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు..

రాజమహేంద్రవరం, పెనుగంచిప్రోలు, నున్నిపెంట, పెదవేగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నదుల్లో స్నానానికి వెళ్లిన తొమ్మిది మంది మృత్యువాతపడ్డారు. శ్రీశైలంలో నీటిలో మునిగిపోతున్న కొడుకును రక్షించబోయి తండ్రి, బలివే దగ్గర తమ్మిలేరులో అన్నదమ్ములు, గోదావరి నదిలో మునిగిపోతున్న స్నేహితుల రక్షణ కోసం వెళ్లిన విద్యార్థులు చనిపోయారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్(17), తిరుమలశెట్టి పవన్(19), పడాల దేవదత్త సాయి(18), పడాల రామ దుర్గాప్రసాద్(19), అనిశెట్టి పవన్ గణేశ్(17) తోపాటు మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి బుధవారం గోదావరి ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుక మేటలు ఉన్నాయని మరింత ముందుకు వెళ్లారు. నదిలో సుమారు పది అడుగుల దూరం వెళ్లిన తర్వాత నీళ్లు బాగా నీలం రంగులో ఉన్నాయని, ముగ్గురు మరింత ముందుకు వెళ్లారు. అంతే.. అకస్మాత్తుగా నీటిలోకి జారిపోయారు. వాళ్లను రక్షిద్దామని వెళ్లిన మరో ఇద్దరు కూడా పైకి రాలేకపోయారు. దీంతో ఐదుగురూ ప్రాణాలు విడిచారు. మిగతా స్నేహితుల అరుపులతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలియగానే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. నదిలో గాలించి ఐదుగురి మృతదేహాలను బయటకు తీశారు. విద్యార్థులంతా ఒకే ఊరు, ఒకే వీధికి చెందిన వాళ్లు కావడంతో గ్రామం శోకంలో మునిగిపోయింది.

శ్రీశైలంలో తండ్రీకొడుకులు..


తండ్రీకొడుకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన పెరుగు గురవయ్య (35), అతడి కుమారుడు వాసు (11) శ్రీశైలం వద్ద కృష్ణా నదిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రాంతానికి చెందిన 40 మంది భక్తులు శ్రీశైలం వెళ్లారు. బుధవారం స్నానాలు చేసేందుకు నదిలోకి దిగారు. ముందుగా కుమారుడు వాసు నీటిలోకి దిగి.. కాలు జారి కొట్టుకుపోతుండగా అతడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రి కూడా అదృశ్యమయ్యారు. మత్స్యకారులు మృతదేహాలను బయటకు తీశారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడపడితే అక్కడ డ్రెడ్జింగ్ చేయడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే యువకులు మృత్యువాతపడ్డారు. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేవు.

తమ్మిలేరులో అన్నదమ్ములు..

ఏలూరు జిల్లా ముసునూరు మండలం బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన అన్నదమ్ములు తమ్మిలేరులో స్నానానికి దిగి చనిపోయారు. లింగపాలెం మండలం తిమ్మక్కపాలేనికి చెందిన పేరిచర్ల మారేష్, మంగమ్మ దంపతులు, వారి కుమారులు మునియ్య, మణికుమార్ బంధువులతో కలిసి బలివే వచ్చారు. తమ్మిలేరులో స్నానాలు చేసి, స్వామివారి దర్శనానికి బయలు దేరారు. కుమారులిద్దరూ కొద్దిసేపు స్నానం చేసి వస్తాం... మీరు వెళ్లండని తల్లిదండ్రులకు చెప్పారు. దర్శనం పూర్తయినా.. కుమారులిద్దరూ రాకపోవడంతో వెతుక్కుంటూ తమ్మిలేరు దగ్గరకు వచ్చారు. మునిపల్లె సమీపంలో మణికుమార్(18) మృతదేహం కనిపించింది. మరో కుమారుడి కోసం వెతుకుతుండగా నీటిలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు మునియ్య(20) మృతదేహం కనిపించింది. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం నిండిపోయింది.

రీ సర్వే డ్యూటీలో ఉన్నా హాజరు తప్పనిసరి

» రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్లకు హాజరు తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రీ సర్వే, స్వమిత్వ, ఇతర విధుల కోసం గ్రామాలు, మండలాలు మారి వేరోచోట విధులు నిర్వర్తించే వారికి కూడా హాజరు తప్పనిసరి చేస్తూ భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జి. జయలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు వారి హాజరుపై నిర్దిష్టమైన ఆదేశాలివ్వాలని గ్రామ, వార్డు సచివాలయాల విభాగానికి ఆమె లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రీ సర్వే విధుల్లో భాగంగా సొంత మండలం లేదా ఇతర మండలాల్లో పనిచేసే వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో హాజరు నమోదు చేసుకోవాల్సిందేనని గ్రామ, వార్డు సచివాలయాల విభాగం కార్యదర్శి కాటమేని భాస్కర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. రీ సర్వే పనుల్లో ఉన్నామని, తమకు హాజరు మినహాయించాలని పలువురు సర్వేయర్లు కొంతకాలంగా కోరుతున్నారు. అయితే ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు రీసర్వే పనులు మానేసి ఇతర కార్యకలాపాల్లో బిజీగా ఉండిపోతున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, రీ సర్వే పనుల కోసం ఇతర మండలాలకు డిప్యూట్ అయిన వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా హాజరు వేయాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సరికొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నాం



- ఆది పినిశెట్టి

'కథాబలంతో పాటు బలమైన భావోద్వేగాలు ఉన్న హారర్ చిత్రం 'శబ్దం'. ఇప్పటివరకూ వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని హీరో ఆది పినిశెట్టి అన్నారు. 'వైశాలి' చిత్రం తర్వాత దర్శకుడు అరివళగన్, ఆది పినిశెట్టి కలయికలో వస్తున్న చిత్రమిది. సెవెన్ జీ ఫిల్మ్స్ శివ నిర్మించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్, ఎన్ సినిమాస్ ద్వారా ఈ నెల 28న 'శబ్దం' చిత్రం తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఆది పినిశెట్టి మీడియాతో పంచుకున్నారు. "ఇప్పటివరకూ ప్రేక్షకులకు తెలియని ఓ సరికొత్త ప్రపంచాన్ని 'శబ్దం' చిత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నాం. ఇందులో అతీత శక్తుల గురించి అన్వేషించే పరిశోధకుడి పాత్రలో కనిపిస్తాను. సాంకేతికంగా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. ఆత్మలకూ శబ్దానికి ఉన్న సంబంధం ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. 'వైశాలి' లానే 'శబ్దం' కూడా నిజాయితీగా చేసిన ప్రయత్నం. తప్పక ఫలిస్తుందనే నమ్మకం ఉంది. సిమ్రాన్, లైలా పాత్రలు సినిమాలో కీలకం. తమన్ నేపథ్య సంగీతం అద్భుతంగా కుదిరింది. ప్రస్తుతం 'అఖండ 2, మరకతమణి 2, మయసభ, డ్రైవ్' చిత్రాలు చేస్తున్నాను" అని ఆయన చెప్పారు.

మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు



'శివన్న' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే కన్నడ టాప్ స్టార్ శివ రాజ్‌కుమార్ క్యాన్సర్ నుంచి కోలుకున్నారు. మార్చి నుంచి మళ్లీ షూటింగ్స్‌కు హాజరవుతానని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తనకు క్యాన్సర్ ఉన్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో తెలిసిందనీ, కుటుంబ సభ్యులు, వైద్యులు ఇచ్చిన ధైర్యంతో చికిత్స చేయించుకున్నాననీ శివ రాజ్‌కుమార్ ఆ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'కీమో థెరపీ చేయించుకుని షూటింగ్‌కు వెళ్లిన రోజులు ఉన్నాయి. మొత్తానికి క్యాన్సర్ నుంచి బయట పడ్డా. చికిత్స అనంతరం ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేస్తున్నా. ఆహార నియమాలు పాటిస్తున్నా. మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొంటున్నా. మార్చి 5న హైదరాబాద్ వెళ్లి రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటా. ఆ సినిమాలో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది' అని చెప్పారు శివ రాజ్‌కుమార్.



ప్రభాస్, ప్రశాంత్ వర్మ చిత్రం.. ఎప్పటినుంచి?




హీరో ప్రభాస్ స్పీడ్ పెంచారు. చేతిలో ఉన్న సినిమాలు చకచకా పూర్తి చేస్తూ కొత్త వాటి మీద కూడా దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన 'రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలు చేస్తున్నారు. ఇవి కాకుండా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందే 'స్పిరిట్' సినిమా చేయాలి. ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ నటించనున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా వీలైనంత త్వరలో ప్రారంభించాలని ప్రభాస్ ఆలోచన. ఇప్పుడు ఆయన మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటూ పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారనీ, ఈ సినిమాకు సంబంధించి ప్రభాస్ లుక్ టెస్ట్ కూడా జరిగిందని సమాచారం. ఇవి కాకుండా 'కల్కి పార్ట్ 2', 'సలార్ 2' చిత్రాలను ప్రభాస్ చేయాలి. ఇన్ని సినిమాలు ప్రభాస్ ఎప్పుడు, ఎలా చేస్తారు, వీటిల్లో ఏది ముందు మొదలవుతుందనేదే ఆ చర్చ.

సందేశం, వినోదం అలరిస్తాయి



బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఆయన కథానాయకుడిగా మాధవ్ కోదాడ దర్శకత్వంలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించిన చిత్రం "నేనెక్కడున్నా'. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిమో చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ.. 'చిన్నప్పటి నుంచి దక్షిణాది చిత్రాలు చూస్తూ పెరిగాను. నాకు తెలుగు సినిమాలో అవకాశం వచ్చిందని తెలియగానే నాన్న సంతోషించారు. 'ప్రయత్నలోపం లేకుండా కష్టపడు, నిజాయితీగా పనిచెయ్యి' అని చెప్పారు. సందేశం, వినోదం కలబోతగా దర్శకుడు 'నేనెక్కడున్నా' చిత్రాన్ని తీర్చిదిద్దారు. యాక్షన్ సీక్వెన్స్‌లు, పతాక సన్నివేశాల్లో వచ్చే మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. ఈ చిత్రంతో హీరోగా తెలుగులో నిలదొక్కుకుంటాననే నమ్మకం ఉంది' అని చెప్పారు.

తెలుగులోకి 'ఛావా'



విక్కీ కౌశల్, రష్మిక జంటగా రూపుదిద్దుకున్న చారిత్రక చిత్రం 'ఛావా'. బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. పదకొండు రోజుల్లో ఈ సినిమా రూ. 417 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో బాలీవుడ్ సంబరాలు చేసుకుంటోంది. దక్షిణాది సినిమా వచ్చి తమని చావు దెబ్బ తీసిందని వాపోతున్న సినీ వర్గాలు 'ఛావా' విజయంతో ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఉత్తరాదిన విజయయాత్ర కొనసాగిస్తున్న ఈ సినిమా త్వరలో తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న తెలుగు ప్రేక్షకుల కోసం తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మార్చి 7న విడుదల చేస్తోంది.

పెళ్లి నేపథ్యంలో పీరియాడిక్ చిత్రం



పెళ్లి నేపథ్యంలో హాస్యం, వ్యంగం కలబోతగా రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించింది. 1980లో వరంగల్ జిల్లాలో జరిగిన సంఘటన ఆధారంగా అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత తెలిపారు.

రాక్షసుడు వస్తున్నాడు



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్ దర్శకత్వంలో ఎంవీఆర్ కృష్ణ నిర్మించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ఫిబ్రవరి 28కి బదులు మార్చి 7న 'రాక్షస' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ బుధవారం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ: జైబిన్ పి. జాకబ్

గుండెలోన గట్టి సప్పుడు



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, సవాళ్ల నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'నారి'. ఆమని ప్రధాన పాత్ర పోషించారు. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న ఈ చిత్రం విడుదలవుతోంది. మహా శివరాత్రి సందర్భంగా 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. రమణ గోగుల ఆలపించగా, వినోద్ కుమార్ విన్ను స్వరపరిచారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వి. రవికుమార్.

ఒగ్గు కళ నేపథ్యంలో




ఒగ్గు కళాకారుల జీవితాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, జయరామ్, ఛత్రపతి శేఖర్ కీలకపాత్రలు పోషించారు. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. దర్శకుడు చందు మొండేటి ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 'ఒగ్గు కళాకారుల జీవితాల్లోని ఒడిదొడుకులను వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం 'బ్రహ్మాండ' చిత్రం ద్వారా చేస్తున్నాం' అన్నారు. తెలంగాణ సంస్కృతి, పల్లె ప్రజల అనుబంధాలను దర్శకుడు తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, సినిమాటోగ్రఫీ: కాసుల కార్తీక్

శివుని పాటతో చంద్రేశ్వర



సురేష్ రవి, ఆశ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'చంద్రేశ్వర'. మన సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరిస్తూ దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ సినిమాను జీవా పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా సినిమాలోని శివుని పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఆర్కియాలజీ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. డివోషనల్ టచ్‌తో పాటు మంచి కామెడీ కూడా సినిమాలో ఉంది. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

కొత్తదనంతో క్రైమ్ కథ




ఊహించని మలుపులు, భయానక సంఘటనలతో రూపొందుతున్న చిత్రం 'బ్లడ్ రోజెస్'. ఎంజీఆర్ దర్శకత్వంలో హరీశ్ కే నిర్మించారు. సీనియర్ నటుడు సుమన్, రంజిత్‌రామ్, అప్సర రాణి ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా చిత్రబృందం బుధవారం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. భయపెట్టే కథనం, ఊపిరిసలపని ట్విస్టులతో మా క్రైమ్ కథా చిత్రం ఆద్యంతం ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: పెద్దపల్లి రోహిత్, సినిమాటోగ్రఫీ: శివకుమార్ ఓగిరెడ్డి.

PARAS

భక్తిశ్రద్ధల మధ్య మహాశివరాత్రి

భక్తజన సంద్రంగా మారిన కోటప్పకొండ

శివనామస్మరణతో మార్మోగిన అమరావతి, క్వారీ, గోవాడ, కాకాని



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి



కోటప్పకొండలో అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

శివాయ.. రుద్రాయ

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం గురువారం భక్త జన సందోహం మధ్య అత్యంత ఘనంగా జరిగింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్లతో పాటు అమరావతి అమరేశ్వరాలయం, పెదకాకాని భ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి ఆలయం, అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామి ఆలయం, చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయాలతో పాటు శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణలతో మార్మోగాయి. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి భక్తులు పోటెత్తారు. శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్లతో కోటప్పకొండ ప్రాంతం జనసంద్రంగా మారింది. సాయంత్రం నుంచి భక్తుల రద్దీ అంతకంతకు పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు బిందె తీర్థం, పంచామృతాలతో అభిషేకాలు చేసి స్వామికి విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన వున్న బొచ్చు కోటయ్యస్వామి వద్ద తలనీలాలను భక్తులు సమర్పించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షించారు. 2,500 పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించారు.



నాగేంద్రస్వామి పుట్టవద్ద భక్తుల పూజలు

స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలను, వెండి ప్రభను సమర్పించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఏడీసీ చంద్రకాంత్, డీసీ శ్రీనివాసరావు ఈవోలు చంద్రశేఖరరావు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కనువిందు చేసిన ప్రభలు..

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువన కొలువు దీరాయి. కొండపై ఆలయం, కొండ దిగువన ప్రభలు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనాయి. విద్యుత్ వెలుగుల్లో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. ప్రభల రాకతో చిలకలూరిపేట రహ దారి శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో సాధారణ ప్రభల రాకతో కోలాహలం నెలకొంది.





నరసరావుపేటలో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి ఆనం

కోటప్పకొండ తిరునాళ్లలో పలు మార్లు ట్రాఫిక్ జామైంది. స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో దాదాపు గంట పాటు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కాన్వాయ్ ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో మంత్రి ఆనం ట్రాఫిక్ నుంచి బయటపడ్డారు. పెట్లూరివారిపాలెం, యలమందల రహదారిలో రాత్రి పది గంటల సమయంలో ట్రాఫిక్ స్తంభించింది. గంటల తరబడి భక్తులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా ఇక్కట్లు పడ్డారు. పోలీసుల ముందస్తు ప్రణాళికలు విఫలమవడంతో ట్రాఫిక్ కష్టాలు నెలకొన్నాయి.

వీఐపీల తాకిడి.. ఆదాయానికి గండి

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీల తాకిడి భారీగా ఉంది. డీఎస్పీ కార్యాలయం నుంచి 15 వేలకు పైగా వీఐపీ, వీవీఐపీ పాసులు పంపిణీ చేసినట్లు సమాచారం. వీఐపీ క్యూలైన్ కిటకిటలాడింది. వీఐపీల పేరుతో వేలాది మంది స్వామి దర్శనం చేసుకున్నారు. దీంతో క్యూల్లో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీ పాసులు నియంత్రించి ఉంటే టిక్కెట్ కొని స్వామి దర్శనం చేసుకునేవారు. అయితే వారికి పాసులు జారీతో దేవస్థానం ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడింది. వీఐపీల వాహనాలకు కొండపైకి అనుమతించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల సేవలో కొందరు అధికారులు తరించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖరరావు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, కొలికపూడి శ్రీనివాసరావు, రామాంజనేయులు, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖరరావు, లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ముగుడు హనుమంతరావు, లావు రత్తయ్య, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ స్వామిని దర్శించుకున్నారు.

భక్తులకు చుక్కలు చూపించిన ఆర్టీసీ

కోటప్పకొండ తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులకు ఆర్టీసీ చుక్కలు చూపించింది. అరకొరగా బస్సులు ఏర్పాటు చేసి భక్తులను ఇక్కట్లకు గురి చేసింది. బస్సులు లేక భక్తులు కాలినడకన ఘాట్ రోడ్డున కొండ కిందకు చేరుకున్నారు. వీఐపీల సేవలో తరించిన అధికారులు సామాన్య భక్తులను విస్మరించారు. సాయంత్రం వేళ భక్తులు రద్దీగా ఉన్న సమయంలో చాలా తక్కువ సంఖ్యలో బస్సులు ఏర్పాటుతో ప్రయాణికులు తోపులాటకు గురయ్యారు టికెట్ వసూలు చేసిన ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటును విస్మరించి తమను నడిపిస్తున్నారంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

శైవక్షేత్రాలు.. భక్తజన సంద్రం

పెదకాకాని, అమరావతి, అమృతలూరు, పొన్నూరుటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తజన సంద్రంగా మారాయి. అర్ధరాత్రి లింగోద్భవ పూజల అనంతరం స్వామివార్లను భక్తులు దర్శించుకుని తరించారు. పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదేవి సమేత కాకాని మల్లేశ్వరుడు గ్రామోత్సవంలో పెదకాకాని పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో తెల్లవారుజామున అమరేశ్వరుడికి తొలి అభిషేకం ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు, ఈవో సునీల్‌కుమార్ సమక్షంలో జరిగింది.



అమరావతి : అమరేశ్వర స్నానఘాట్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



పెదకాకాని : మల్లన్న సన్నిధిలో క్యూలో బారులు తీరిన భక్తులు



చేబ్రోలు : క్వారీలో తిరునాళ్ల సందడి



అమృతలూరు : గోవాడలో ప్రత్యేక అలంకరణలో శ్రీబాలకోటేశ్వరస్వామి, అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, జగన్మోహనరావు, కన్నా లక్ష్మీనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం తెల్లవారుజామున అమరేశ్వరస్వామి వార్ల కల్యాణమహోత్సవం జరగనున్నది. కల్యాణమూర్తులకు గురువారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామికి అర్ధరాత్రి ప్రత్యేక పూజల అనంతరం దర్శనాలకు భక్తులను అనుమతించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి నుంచి మూలవిరాట్ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహిళలు పొంగళ్లు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు స్వామి వారికి వస్త్రాలు సమర్పించి అభిషేక పూజలలో పాల్గొన్నారు.

నేడు పట్టభద్రుల పోలింగ్

● బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది ● గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఆరు జిల్లాల్లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రిని పీవోలకు అందజేసి రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రూట్ల వారీగా సిబ్బందికి సామగ్రి పంపిణీని బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, జేసీ భార్గవతేజతో కలిసి పరిశీలించారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు రాత్రికి అక్కడే బస చేసి ఉదయం 7 గంటలకు ఏజంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సుకు సీలు వేసి సరిగ్గా 8 గంటలకు ఓటింగ్‌ని ప్రారంభిస్తారు. గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లను మాత్రమే ఓటు వేయడానికి అనుమతిస్తారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తాడేపల్లి మండలంలో ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. మొత్తం 3,47,116 మంది ఓటర్లు ఉండగా 483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు కలిపి 144 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు, 9 అత్యంత సమస్యాత్మక, 57 సమస్యాత్మక, 273 సాధారణ కేటగిరీలుగా విభజించారు. 800 మంది ఓటర్ల కంటే తక్కువ ఉన్న పోలింగ్ బూత్‌లకు రెండు, అంతకంటే పెచ్చు ఓటర్లు ఉన్న బూత్‌లకు మూడు బ్యాలెట్ బాక్సులను కేటాయించారు.

ఓటు వేయాలంటే ఏదో ఒక ఐడీ తప్పనిసరి

ఓటరుగా నమోదైన వారు ఎన్నికల సంఘం జారీ చేసిన ఎలక్టోరల్ ఫోటో గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చు. ఒకవేళ ఈ కార్డు లేకపోతే ఆధార్/ డ్రైవింగ్ లైసెన్సు/పాన్/ఇండియన్ పాసు పోర్టు/ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్, స్థానిక సంస్థలు, ప్రైవేటు ఇండస్ట్రియల్ హౌసెస్ జారీ చేసిన సర్వీసు గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చు. ఎంపీ/ఎమ్మెల్సీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీలు వారి గుర్తింపు కార్డులు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. విద్యాసంస్థలు జారీ చేసిన సర్వీసు ఐడెండిటీ కార్డులు చూపించినా ఓటు వేయడానికి అనుమతిస్తారు. విశ్వవిద్యాలయం జారీ చేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. దివ్యాంగులు అయితే వారికి కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన సర్టిఫికేట్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన యూడీఐడీకార్డు చూపించాన ఓటు వేయడానికి అనుమతిస్తారు.



నరసరావుపేట : మునిసిపల్ బాలికల స్కూల్‌లో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, డీఆర్వో మురళి

ఓటరు స్లిపు తప్పనిసరి కాదు

ఓటరుగా నమోదైన పట్టభద్రులకు ఓటరు స్లిప్పు అందకపోయినా ఓటు వేయడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఓటు వేయడానికి స్లిప్పు తప్పనిసరి కాదని ఏఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. పోలింగ్ బూత్ నంబరు. సీరియల్ నంబరు ప్రిసైడింగ్ అధికారికి చెప్పి ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపిస్తే ఓటు వేయడానికి అనుమతిస్తారని స్పష్టం చేశారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

పోలింగ్ దృష్ట్యా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు ఆర్వో నాగలక్ష్మి తెలిపారు. కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకునేలా యాజమాన్యాలు క్యాజువల్ లీవులు, ఆలస్యపు అనుమతులు మంజూరు చేయాలన్నారు.



గుంటూరు : ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో కలెక్టర్



రేపల్లె : ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వరి గడ్డి ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వడ్డవల్లికి చెందిన తోట సంతోష్ కుమార్(15), కూరపాటి లిఖిత్(11)ది ఎదురెదురు గృహాలు. శివరాత్రి సందర్భంగా సంతోష్ కుమార్ తన తండ్రికి చెందిన ద్విచక్ర వాహనంపై లిఖిత్‌ను ఎక్కించుకొని అచ్చంపేట రోడ్డులో నిర్మలనగర్‌లో గల నాయనమ్మ గృహానికి బయలు దేరారు. గృహానికి సమీపంలోని సాయికృష్ణ థియేటర్ దాటగానే ఆగి ఉన్న గడ్డి ట్రాక్టర్‌ను వీరు ప్రయాణిస్తు న్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ సమయంలో మంచు ఉండటంతో వరిగడ్డి ట్రాక్టర్ కన్పించకపోవటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు విద్యార్థులు రోడ్డుపై పడటంతో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా లిఖిత్‌ను ఏరియా వైద్యశా లకు తరలించగా మృతి చెందాడు. స్థానికులు సమాచా రాన్ని తల్లిదండ్రులకు, పోలీసులకు తెలపటంతో మృతదే హాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సంతోష్‌కుమార్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువు తుండగా లిఖిత్ మరో ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. లిఖిత్ తండ్రి సుధీర్‌కు ఒక కుమార్తె కూడా ఉంది. సంతోష్‌కుమార్ తండ్రి జానకి రామయ్య పాస్టర్‌గా పని చేస్తుంటాడు. ఇరువురు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివరాత్రి రోజునే ఇద్దరు విద్యార్థులు మృతి చెందటం వడ్డవల్లి ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



తోట సంతోష్‌కుమార్, కూరపాటి లిఖిత్ (ఫైల్)

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	78, 85, 95
చికెన్ విత్ స్కిన్	150.00
చికెన్ స్కిన్ లెస్	160.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిహారి దంపతులకు తీర్థం అందజేస్తున్న ఆలయ ప్రధానాచార్యులు




ఆలయాన్ని సందర్శిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి సుమతి

శివనామస్మరణతో మార్మోగిన అమరేశ్వరాలయం

- మహాశివరాత్రికి వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు
- భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసిన అర్చకులు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం భక్తజనుల శివనామస్మరణలతో మార్మోగింది. బుధవారం ఉదయం 4గంటలకు అమరేశ్వరుడికి తొలి అభిషేకం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ దంపతులు, ఈవో సునీల్‌కుమార్‌ల సమక్షంలో చేశారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 10 గంటల వరకు భక్తులు రావడం అంతంత మాత్రంగా ఉండగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. భక్తులు కొందరు కృష్ణానది స్నానఘాట్‌లో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు నదీతీరంలో తమ పితృదేవతలకు పిండాలు సమర్పించారు. డీఎస్పీ ఎం హనుమంతరావు పర్యవేక్షణలో సీఐలు అచ్చయ్య, సుబ్బారావులు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

అమరేశ్వరుడి ఆశీర్వాదంతో రాజధాని అభివృద్ధి

● డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

దేవతల రాజధాని అమరావతిని పాలించిన దేవేంద్రుడుచే ప్రతిష్ఠించబడిన అమరేశ్వరుడి ఆశీర్వాదంతో రాజధాని అమరావతి త్వరగా అభివృద్ధి చెంది ప్రజారాజధానిగా వెలుగొందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కే రఘురామకృష్ణంరాజు అన్నారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆహ్వానం మేరకు రఘురామకృష్ణంరాజు, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహనరావు బుధవారం సాయంత్రం అమరేశ్వరాలయం సందర్శించారు. ముగ్గురు ప్రజాప్రతినిధులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి పీ సునీల్ కుమార్ స్వాగతం పలికారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ప్రజాప్రతినిధుల పేరుమీద స్వామివార్లకు పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థపసాదాలు అందజేశారు.

స్వామిని దర్శించిన వారిలో సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన నాయకులు సామినేని ఉదయబాను, తదితరులు ఉన్నారు.



అమరేశ్వరాలయం దర్శించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



అమరేశ్వరాలయంలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన నాయకుడు సామినేని ఉదయభాను

అమరేశ్వరుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరాలయాన్ని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు రవినాథ్ తిహారి, సుమతి, సత్యప్రసాద్‌లు సందర్శించారు. న్యాయమూర్తులకు ఈవో సునీల్ కుమార్, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. న్యాయమూర్తుల పేరుమీద ఆలయ అర్చకులు స్వామివార్లకు వేరువేరుగా పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడే స్వామివారి దివ్యరథోత్సవం

మహాశివరాత్రి పర్వదినం రోజున లింగోద్భవ అభిషేకాల అనంతరం గురువారం తెల్లవారుజామున 3గంటలకు బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. నూతన దంపతులైన దేవతామూర్తులను సాయంత్రం 4గంటలకు దివ్యరథంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. రథోత్సవం ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సత్రశాలలో భక్తజన సందోహం

● ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దంపతులు

రెంటచింతల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పల్నాట ప్రముఖ శైవక్షేత్రం, కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం భక్తజనంతో నిండిపోయింది. వేలాది మంది మల్లికార్జునస్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్నారు. ప్రాంగణమంతా శివనామస్మరణతో మార్మోగింది. వేకువ జాము నుంచే ఆలయ పూజారి శర్మ నేతృత్వంలో సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, జలబిందెలతో స్వామికి అభిషేకాలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గుండా శివయ్య, ఈవో రామిరెడ్డిల నేతృత్వంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దంపతులకు, శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డిలకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మందికి అన్నదానం చేశారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లీలావతి, ఎంపీడీవో సరోజని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలువాయి జంక్షన్లో సర్పంచ్ మందలపు విజయలక్ష్మిలచ్చిరెడ్డి నేతృత్వంలో శివరాత్రి భక్తుల కోసం ఏర్పాటు చేసిన మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు, అల్లం బ్రహ్మారెడ్డి నేతృత్వంలో అల్పాహార కేంద్రాలు రెండింటిని ప్రారంభించారు. ఏపిజెన్‌కో ఎస్ఈ వెంకటరమణ నేతృత్వంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు.

● **వెల్దుర్తి (ఆంధ్రజ్యోతి):** ఉప్పలపాడులోని బుగ్గమల్లేశ్వరస్వామి, వీరభద్రస్వామి, గొట్టిపాళ్లలోని మార్కండేయస్వామి, దావుపల్లిలోని శివునిబావి ఆలయాలకు ప్రజలు అధికసంఖ్యలో చేరుకొని పూజల్లో పాల్గొన్నారు.

● కారంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల శివారులో గల నల్లమల కొండల్లో స్వయంభుగా వెలసిన ధనమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

● **దుర్గి (ఆంధ్రజ్యోతి):** దుర్గిలోని శ్రీబుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఏలేశ్వరం గట్టుకు పోటెత్తిన భక్తులు



ఏలేశ్వరం గట్టుపై భక్తులు

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం మధ్యలో ఏలేశ్వరంగట్టుకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. అర్చకుడు శ్రీపాద సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల వరకు స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిపారు. ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యాన ప్రత్యేక లాంచీలను నడిపారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ.3.60 లక్షల ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చినరామస్వామి, లాంచీ యూనిట్ మేనేజర్ శివారెడ్డి, వినయతుల్లా, పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిపాడు కృష్ణానదిలో పుణ్యస్నానాలు

అచ్చంపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదిపాడు వద్ద కృష్ణానదిలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఎన్‌టీఆర్ జిల్లా ముక్త్యాల వైపు నుంచి పడవల ద్వారా మాదిపాడు వైపు కృష్ణా నదిలోకి వచ్చి సుమారు నాలుగు వేల మంది భక్తులు బుధవారం పుణ్యస్నానాలు ఆచరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వారి పితృదేవతలకు పిండ ప్రధానాలు చేశారు. ఈ నేపథ్యంలో నదీ తీరమంతా ఓంకార నాదంతో మార్మోగింది. రెవెన్యూ శాఖ భక్తులకు ఏర్పాట్లు చేశారు. అచ్చంపేటలోని హరి హర క్షేత్రంలో శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో వైభవంగా శివరాత్రి వేడుకలు జరిగాయి.

● **పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి) :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని 75 తాళ్ళూరు కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పెదకూరపాడులోని గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.



కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

● **క్రోసూరు (ఆంధ్రజ్యోతి):** క్రోసూరులోని పురాతన కాశీ విశ్వేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● **బెల్లంకొండ (ఆంధ్రజ్యోతి) :** బెల్లంకొండ ఊరి చివర ఉన్న శివాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు.

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణ

● అధికారుల ఆదేశాలు బేఖాతరు



ఆక్రమణకు గురైన ప్రధాన రహదారి

దుర్గి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారులు అధికారుల ఆదేశాలనూ లెక్కజేయడం లేదు. దుర్గిలోని ఇందిరమ్మ కాలనీలో 500 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని కొందరు ఆక్రమించడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని స్పందన ద్వారా కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ ఫణీంద్రకుమార్ ఆక్రమణను నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ ఆక్రమణదారులు ఆయన ఆదేశాలు పక్కనపెట్టారు. మండలపరిషత్ కార్యాలయం ఎదురుగానే ఈ ఆక్రమణ జరుగుతోంది. ఆక్రమణకు గురవుతున్న రహదారిని కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

యువకుడిపై కర్రలతో దాడి

గురజాలటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): యువకుడిపై కర్రలతో దాడి చేసి గాయపరిచిన ఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలోని చర్లగుడిపాడులో జరిగింది. గ్రామానికి చెందిన కొల్లా సాయికుమార్‌పై అదే గ్రామానికి చెందిన సుమారు 8 మంది కర్రలతో దాడి చేసి గాయపరిచారు. తలకు బలమైన గాయాలు కావడంతో సాయికుమార్‌ను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు నరసరావుపేటకు తరలించారు. ఈ మేరకు సాయికుమార్ కుటుంబసభ్యులు గురజాల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

బైక్ ఆటో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను ఆటో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలోని చెక్ పోస్టు వద్ద బుధవారం రాత్రి జరిగింది. పట్టణంలోని దోబీఘాట్‌లో నివాసం ఉంటున్న షేక్ సాయిదా, ఆమె భర్త దరియావలి తమ పిల్లలకు చెరుకులు కొనుక్కొని తీసుకెళ్లేందుకు బైక్‌పై చెక్ పోస్టు సెంటర్ వద్దకు వచ్చారు. ఆ సమయంలో వారి వెనుకగా వస్తున్న ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరు కింద పడ్డారు. సాయిదాకు తీవ్ర గాయాలు, దరియావలికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం సాయిదాను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటన పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దైదలో వైభవంగా శివరాత్రి ఉత్సవాలు

అమరలింగేశ్వరుడిని దర్శించుకున్న యరపతినేని



అమరలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైదలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత అమరలింగేశ్వరస్వామిని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. తన తనయుడు నిఖిల్‌తో కలిసి స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో పూర్ణచంద్రరావు ఆధ్వర్యాన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారని అధికారులను అభినందించారు. దైదలోని శ్రీబుగ్గమల్లేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం ముందు ఉన్న స్తంభాల వాగుపై నూతనంగా నిర్మించిన కాలినడక బ్రిడ్జిని ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. అలాగే మండలంలోని గోగులపాడులో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన పూజల్లో తనయుడు నిఖిల్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతర అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్య క్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.

10 వేల మంది భక్తులకు అన్నదానం

మాచవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మోర్జంపాడు సమీపంలో ఉన్న బుగ్గమల్లయ్య స్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు 10 వేల మందికి పైగా భక్తులకు మహా అన్నదానం, మంచినీటి బాటిల్స్ అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు యరపతినేనికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు దంపతులు, వుడతా శ్రీను, కర్పూరపు వెంకటేష్, బడిగుంచల వెంకటేశ్వర్లుతో పాటు దేవాలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

భోళాలింగేశ్వరుడి దేవాలయంలో..

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే యరపతినేని గురజాల, మాచవరం, పిడుగురాళ్లలోని ప్రముఖ శివాలయాలను సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ శివారులోని భోళాలింగేశ్వరుడి దేవాలయంలో మహాశివరాత్రి అభిషేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గుత్తికొండ బిలం, నాగులగుడి, శివాలయం, గంగమ్మగుడితో పాటు పలు దేవాలయాల్లోను మహాశివరాత్రి పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో హాజరై అభిషేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి మహాలక్ష్మమ్మవారి జాతర

బెల్లంకొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపాలెంలో గల మహాలక్ష్మమ్మవారి జాతర ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు బుధవారం తెలిపారు. 7వ తేదీన సుప్రభాత సేవా కార్యక్రమాలు, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 28వ తేదీ సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద జాతర ప్రారంభమవుతుందని అన్నారు.

సత్యా షోరూం ప్రారంభం



పిడుగురాళ్లలో కొత్తగా ప్రారంభమైన సత్యా షోరూం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వస్తువుల రంగంలో ప్రసిద్ధిచెందిన 'సత్యా' సంస్థ తన 49వ షోరూంను పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఏర్పాటు చేసింది. జీవీ మాల్ వద్ద ఏర్పాటైన ఈ షోరూంను భవన యజమాని కోటేశ్వరరావు బుధవారం లాంఛనంగా ప్రారంభించగా సత్యా ఏపీ సేల్స్ హెడ్ సెంథిల్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీఎం సురేష్ మాట్లాడుతూ.. ప్రతి 1.5 5స్టార్ ఏసీ కొన్న వినియోగదారులకు టీవీ, ప్రతి 1.5 3 స్టార్ ఏసీ కొనుగోలు చేసిన వినియోగదారులకు టేబుల్ ఫ్యాన్ ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. అన్ని గృహోపకరణాలపై 70 శాతం వరకు తగ్గింపు, ప్రతి కొనుగోలుపై ఉచిత బహుమతి అందించనున్నట్లు పేర్కొన్నారు.

ముక్తేశ్వర స్వామి ఆలయంలో..

దాచేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి నగర పంచాయతీలోని 400 సంవత్సరాల చరిత్ర కలిగిన నాగేంద్ర సహిత గంగా పార్వతి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసానుపల్లిలోని గంగాభవానీ సమేత చంద్రమౌళేశ్వర స్వామి, నారాయణపురంలోని గంగా భవానీ సమేత భవానీ శంకర్ స్వామి, పొందుగులలోని గంటల రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కోటప్పకొండ, వాడపల్లి, మట్టపల్లి, గోగులపాడు, సత్రశాలతో దైద ఆలయాలకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపింది. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



సత్తెనపల్లిలో అచ్చంపేట రోడ్డులోని శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో ఉన్న రెండు శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. అచ్చంపేట రోడ్డులో ఉన్న శివాలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి వారిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు కూడా శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని కన్నా ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొల్లిపర కాశీ విశ్వనాథం, సయ్యద్ పెద కరీముల్లా, బత్తుల ఆదినారాయణ, ఆతుకూరి నాగేశ్వరరావు, ధూపగుంట్ల జానకి రామారావు, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని నందిగామ, గుడిపూడి, పెద మక్కెన, పాకాలపాడు, రెంటపాళ్ళ, కొమెరపూడితో పాటు పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. వేకువ జాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయంలో దేవతా మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● రాజుపాలెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో మహాశివరాత్రి పండుగ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బలిజేపల్లి, బ్రాహ్మణపల్లి, రెడ్డిగూడెం, గంగిరెడ్డిపాలెం, మొక్కపాడు, ఉప్పలపాడు, నెమలిపురి, చౌటపాపాయపాలెం తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ, దమ్మాలపాడు, నార్నెపాడు, మాదల, కుందురువారిపాలెం గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిశేకాలు నిర్వహించారు.

● **నకరికల్లు (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని చేజర్ల కపోతేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కుంకులగంటలోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో గణపతి పూజతో ప్రారంభించి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి వారికి కళ్యాణం నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27వ తేదీ గురువారం జరగనున్న కృష్ణా - గుంటూరు జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని, కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, ముగ్గురు ఏపీవోలు, ఒక మైక్రో అబ్జర్వర్ చొప్పున 20 మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్‌కేంద్రాల్లో పది మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, చక్రాల కుర్చీలు కూడా అధికారులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో 9,698 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు.



సత్తెనపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లు

ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

పెదకూరపాడులో ఏర్పాట్లు పూర్తి

పెదకూరపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను తహసీల్దార్ నీలి ధనలక్ష్మి పర్యవేక్షించారు. మండలంలో 1307 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉండగా 844 మంది పురుషులు, 463 మంది మహిళలు ఉన్నారు.

పిడుగురాళ్ల నియోజకవర్గంలో..

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను ఆయా తహసీల్దార్లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్ వసతి, ఓటర్లకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఓటరుకు తమ ఓటు ఎక్కడుందో తెలియజేసేలా పోలింగ్ కేంద్రం వద్ద ఫ్లెక్సీలు, సమాచారం ద్వారా తెలియజేశారు. పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలలో తహసీల్దార్ మధుబాబు, ఎన్నికల అధికారులు శ్రీకృష్ణదేవరాయలు, పాపకుమారి, డిప్యూటీ తహసీల్దార్ సుధాకరశర్మ, పలువురు పంచాయతీ, రెవెన్యూ అధికారులు అన్ని ఏర్పాట్లను పరిశీలించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు



నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి అభిషేకాలను అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలోని కామేశ్వర స్వామికి శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణ వెంకటేశ్వర స్వామి, కామేశ్వర స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



శ్రీత్రికోటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు పుల్లారావు, డాక్టర్ అరవిందబాబు తదితరులు



కోటప్పకొండపైకి బస్సులో వస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దంపతులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు, సిబ్బంది





కోటప్పకొండ వద్ద ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సుల వద్ద నెలకొన్న రద్దీ, ఘాట్ రోడ్డులో నడిచివస్తున్న భక్తులు

కనుల పండువగా కోటయ్య తిరునాళ్ల

- ● కిటకిటలాడిన త్రికూటాద్రి
- ● త్రికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



కిటకిటలాడుతున్న కోటప్పకొండ

కోటప్పకొండ (నరసరావుపేట), చిలకలూరిపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రఖ్యాత శైవక్షేత్రం కోటప్పకొండలో శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. హర.. హరా.. చేదుకో కోటయ్య.. చేదుకోవయ్యా.. అంటూ భక్తుల నినాదాలతో త్రికూటాద్రి మారుమోగింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కోటప్పకొండ కిటకిటలాడింది. భక్తులు కోటయ్యస్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నుంచి రద్దీ అంతకంతకు పెరగ్గా అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలి వస్తూనే ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. ఆలయం ఎగువన కొండపైన ఉన్న పాత కోటేశ్వరస్వామి, పాపవినాశేశ్వర స్వామి, దిగువన విఘ్నేశ్వరస్వామి, సోపాన మార్గంలోని ఆనందవల్లి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ధ్యానశివుడు, విఘ్నేశ్వరుడు, నంది, నాగేంద్రస్వామి పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. రెండు అభిషేక మండపాల్లో వేలాది మంది భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండ ఎగువన, దిగువన ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 2,500 పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. న్యాయశాఖ ఆధ్వర్యంలో మొబైల్ కోర్టు నిర్వహించారు. ప్రభుత్వం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దంపతులు, కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆర్టీసీ బస్సులో కొండపైకి చేరుకున్నారు.

● త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలోని పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులు, పెద్దలు బోట్ షికార్‌తో సందడి చేశారు. పిల్లల రాజ్యం పార్కులో చిన్నారులు ఆట వస్తువులతో ఉత్సాహంగా ఆడుకున్నారు. పర్యాటక కేంద్రంలోని జింకలు, పంక్షులు, నెమళ్లు, ఎక్వేరియంలను సందర్శించారు. కొండ దిగువన వున్న స్టాల్స్‌లో పెద్ద ఎత్తున ఆట వస్తువులు, చెరకు విక్రయాలు జరిగాయి.

పెద్దఎత్తున అన్నదానం

కొండ దిగువన వివిధ సామాజిక సత్రాలలో పెద్దఎత్తున అన్నదానం జరిగింది. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నదానం చేశారు. కాకతీయ, శ్రీకృష్ణ దేవరాయ, యోగి వేమారెడ్డి, ముదిరాజులు, శాలివాహన, నాయీబ్రాహ్మణ, రజక, బ్రాహ్మణ, ఆదిశైవ, వీరశైవ, విశ్వబ్రాహ్మణ, తొగటి వీరక్షత్రియ తదితర సామాజిక వర్గాల సత్రాలలో లక్ష మందికిపైగా అన్నదానం జరిగినట్లు సమాచారం. అన్నదానం జరిగింది.

సేవలందించిన వలంటీర్లు

తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సేవలు అందజేశారు. సత్యసాయి సేవా సమితి, స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యూలో భక్తులకు తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండ దిగువన పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. దివ్యాంగుల కళా పరిషత్, నవభారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు దివ్యాంగుల చేత సంగీత విభావరి జరిగింది. కొండ దిగువన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు.

విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానం..

విద్యుత్ ప్రభల వెలుగులు, రంగురంగుల దీపాల అలంకరణల ఆలయంతో.. కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభల విద్యుత్ కాంతులు యాత్రికులకు కనువిందు చేశాయి. ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. నరసరావుపేట మండలం కాకాని, ఉప్పలపాడు, గురవాయపాలెం, చిలతలపాలెం నుంచి వచ్చిన ఒక్కొక్క భారీ విద్యుత్ ప్రభ కొండలో కొలువుదీరాయి. చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం నుంచి ఆరు, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరుల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివచ్చాయి. ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలను భక్తులు తిలకించారు.

● నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్ళ సందడి బుధవారం పట్టణంలో నెలకొంది. పట్టణం, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రభలు కొండకు తరలివెళ్ళాయి. ఈ సందర్భంగా పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, కోటప్పకొండ రోడ్డు, బస్టాండ్ తదితర ప్రాంతాలలో తిరునాళ్ళ కోలాహలం నెలకొంది. శివుని విగ్రహాన్ని మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాలలో తిరునాళ్ళకు వెళ్ళి వచ్చే యాత్రికులతో రద్దీ నెలకుంది. కమిషనర్ జస్వంత్, మునిసిపల్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శివుని విగ్రహం సెంటర్, పల్నాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ విగ్రహం సెంటర్, వివిధ ప్రాంతాలలో సేవా సంస్థలు భక్తులకు పులిహోర, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీ గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయం, శృంగేరి శంకరమఠం, వాయు మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్లలోని శంకర స్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. పార్వతిదేవి అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిగాయి. .

● వినుకొండ టౌన్: వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ నుంచి పలు శైవ క్షేత్రాలకు భక్తులను చేరవేసేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. కోటప్పకొండకు 60, శ్రీశైలంకు 10, త్రిపురాంతకానికి 7, మన్నేపల్లికి 6 బస్సులను ఏర్పాటు చేశారు.

● వినుకొండ: మహాశివరాత్రి పండుగ సందర్భంగా కొండపై ఉన్న గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కొలువైన వినుకొండ కొండ చుట్టూ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులతో కోలాట ప్రదర్శనతో స్వామివారి ఊరేగింపుతో గిరిప్రదర్శన ఘనంగా నిర్వహించారు.

● చిలకలూరిపేట: కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లే భక్తులతో చిలకలూరిపేట పట్టణంలో బుధవారం సందడి వాతావరణం నెలకొన్నది. అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పలు వాహనాలను నరసరావుపేట రోడ్డులో నుంచి పంపి కొత్తగా నిర్మించిన బైపాస్ రోడ్డు మీదగా కొండకు మళ్ళించారు. చిలకలూరిపేట రూరల్ పరిధిలో సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పురుషోత్తమ పట్నం అడ్డరోడ్డు వద్ద ఆర్టీసీ వారు ప్రత్యేకంగా ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రయాణికులను స్పెషల్ బస్సుల్లోకి ఎక్కించి పంపించారు. చిలకలూరిపేట మున్సిపాలిటీ వారు ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బందితో వ్యర్థాలను తొలగించే పని చేపట్టారు. కాగా పట్టణంలోని ప్రధాన సెంటర్లలో పెద్ద సంఖ్యలో చెరుకు గడలను అమ్మే స్టాల్స్ నెలకొల్పారు. చిలకలూరిపేట ప్రాంతంలోని పలు సంస్థలు కోటప్పకొండ తిరునాళ్ళకు వెళ్లే భక్తుల కోసం పెద్ద ఎత్తున అల్పాహారం, అన్న ప్రసాద వితరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట, మద్దిరాల, కోటప్పకొండ వద్ద మూడు కేంద్రాల ద్వారా సుమారు 35వేల మందికి అన్నదానం చేశారు.

● చిలకలూరిపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం దర్శించుకున్నారు. శివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు విచ్చేసే భక్తుల ఆకలి తీర్చడానికి వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు చిలకలూరిపేట-కోటప్పకొండ మార్గంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట కార్యక్రమాలలో పోలంరెడ్డి దినేష్ రెడ్డి, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మదన్ మోహన్, మద్దుమాల రవి, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● మహాశివరాత్రి పురస్కరించుకుని మాజీ శాసనమండలి సభ్యుడు రాజశేఖర్, మర్రి లలిత దంపతులు త్రికోటేశ్వరుని దర్శించుకున్నారు.



కోటప్పకొండలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



నరసరావుపేట పట్టణంలోని మహాశివుని విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



చిలకలూరిపేటలో చెరుకు గడలను అమ్ముతున్న వ్యాపారులు



నీటి ప్యాకెట్లను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు



కోటప్పకొండ దిగువన కాలువలో స్నానం చేస్తున్న భక్తులు



దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



కోటప్పకొండ: రాత్రివేళ విద్యుత్ దీపాల వెలుగులో ప్రభలు





ప్రభలపై ప్రదర్శిస్తున్న నృత్యాలు, తిలకిస్తున్న భక్తులు



వినుకొండలో స్వామివారి ప్రతిమతో గిరిప్రదర్శన చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

వెండి నాగాభరణం బహూకరణ

యడ్లపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్ పేటలో శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రూ.లక్ష విలువైన వెండి నాగాభరణంను దాతలు బహూకరించారు. గ్రామానికి చెందిన బశల వెంకటేశ్వరరావు, పుష్పలత దంపతులు, కుమారుడు రవీంద్రనాథ్ ఠాగూర్‌లు బుధవారం ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులకు అందజేశారు. అనంతరం నాగాభరణాన్ని స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సూదా సాంబశివరావు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం స్వామి వారి నాగాభరణాన్ని దొంగలు అపహరించుకుపోయారన్నారు. బశల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుల ద్వారా తిరిగి స్వామివారికి నూతన ఆభరణం సమకూరడంపై వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులకు వెండి నాగాభరణం అందజేస్తున్న వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు

పిడుగురాళ్లలో సత్యా షోరూం ప్రారంభం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వస్తువుల రంగంలో ప్రసిద్ధిచెందిన 'సత్యా' సంస్థ తన 49వ షోరూంను పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఏర్పాటుచేసింది. జీవీ మాల్ వద్ద ఏర్పాటైన ఈ షోరూంను భవన యజమాని కోటేశ్వరరావు బుధవారం లాంఛనంగా ప్రారంభించగా సత్యా ఏపీ సేల్స్ హెడ్ సెంథిల్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీఎం సురేష్ మాట్లాడుతూ ప్రతి 1.5 5స్టార్ ఏసీ కొన్న వినియోగదారులకు టీవీ, ప్రతి 1.5 3స్టార్ ఏసీ కొనుగోలు చేసిన వినియోగదారులకు టేబుల్ ఫ్యాన్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని గృహోపకరణాలపై 70శాతం వరకు తగ్గింపు, ప్రతి కొనుగోలుపై ఉచిత బహుమతి అందించనున్నట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

శావల్యాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొని బుధవారం ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నూజెండ్ల మండలం ఐనవోలుకు చెందిన కె.రామాంజనేయులు, కె.సురేష్‌లు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు విస్తృత ఏర్పాట్లు

● జిల్లాలో 90 పోలింగ్ కేంద్రాలు ● 57,238 ఓటర్లు

నరసరావుపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్‌కు జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేశారు. నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ మెటిరియల్‌ను పంపిణీ చేశారు. పోలింగ్ సిబ్బందిని ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. జిల్లాలో 57,238 మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. వీరిలో 37,973 ఓట్లు పురుషులు.. 19,261 ఓట్లు మహిళలు.. ట్రాన్స్‌జండర్స్ ఓట్లు నాలుగు ఉన్నాయి. మెటీరియల్ పంపిణీని కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్‌వో మురళీ పర్యవేక్షించారు.

● వినుకొండ టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు స్థానిక జూనియర్ కళాశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ బుధవారం తెలిపారు. మొత్తం 4పోలింగ్ బూత్‌లు ఉండగా ఒక పోలింగ్ బూత్‌లో 827, 726, 715, 689 మొత్తం 2952 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీపై అధికారుల నిర్లక్ష్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన పట్టభద్రులకు ఓటరు స్లిప్పుల పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఓటరు స్లిప్పులపై డోర్ నంబరు, ఫోన్ నంబర్లు ఉన్నప్పటికీ కొంతమంది అధికారులు ఓటు హక్కు కలిగిన వ్యక్తికి ఫోన్ చేసి సచివాలయ పరిధిలో ఓటరు స్లిప్పులు తీసుకోవాలని సమాచారం అందించిప్పటికీ మున్సిపాలిటీ పరిధిలో 30 శాతంకు పైగా ఓటరు స్లిప్పులు అధికారుల వద్దే ఉన్నట్లు సమాచారం.

● చిలకలూరిపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ కు సంబంధించి చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, క్యూ లైన్ ల ఏర్పాటు పూర్తయింది. నియోజకవర్గం పరిధిలో మొత్తం 8,779 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. చిలకలూరిపేటలోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు బుధవారం సాయంత్రం పరిశీలించారు పోలింగ్ స్టేషన్ల వద్ద సిబ్బందికి కావలసిన ఏర్పాట్లను పరిశీలించారు.



చిలకలూరిపేటలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నకమిషనర్ పి. శ్రీహరిబాబు

ఘనంగా మన్నేపల్లి లక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్ల



మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్, తిరునాళ్ళకు వచ్చిన భక్తులు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులాపురం శివారు మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ళ బుధవారం ఘనంగా జరిగింది. తిరునాళ్ళ సందర్భంగా పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో భారీ అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి భారీగా ఈ తిరునాళ్ళకు భక్తులు తరలి వచ్చారు. శివరాత్రి రోజున శివనామ స్మరణతో రాష్ట్రం మొత్తం మారుమోగుతుండగా బొల్లాపల్లి మండలంలోని మన్నెపల్లి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో మాత్రం గోవింద నామస్మరణలతో మారు మోగింది. స్వామివారికి సాయంత్రం కల్యాణోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తిరునాళ్ళ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ తిరునాళ్ళకు రెండు విద్యుత్ ప్రభలు తరలి వచ్చాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు తిరునాళ్ళ సందర్భంగా ఏర్పాటు చేశారు. స్వామి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ తిరునాళ్ళ ఉత్సవాన్ని నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.